క్లుప్తంగా

నేడు వనిత ప్రచారం

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత బుధవారం గోపాలపురం మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఆ పార్టీ మండల కన్వీనర్ పోతిరెడ్డి నాగరాజు తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి మండలంలోని భీమోలు, గంగోలు పంచాయతీ పరిధిలోని రాంపాలెం, హుకుంపేట, ఎర్రవరం, సగ్గొండ, గోపవరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం జరుగుతుందని తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

నేడు వైఎస్సార్ సీపీ సమావేశం

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని బుధవారం సాయంత్రం మూడు గంటలకు పట్టణంలోని పరిమి రామారాయుడురత్తమ్మ కల్యాణ మండపంలో నిర్వహిస్తామని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు మంగళవారం తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ సమావేశంలో సమీక్షించనున్నట్టు చెప్పారు.

23వ వార్డులో నేడు ప్రచారం

బుధవారం ఉదయం ఏడు గంటల నుంచి పట్టణంలోని 23వ వార్డులో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్టు తలారి వెంకట్రావు తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి 16వ వార్డు ఔరంగాబాద్‌లో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తామన్నారు.

నాలుగు నామినేషన్ల దాఖలు

కొవ్వూరు: స్థానిక అసెంబ్లీ స్థానానికి స్వతంత్ర్య అభ్యర్థుల తరఫున మంగళవారం నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలయ్యాయి. మొల్ల కమల అనే ఆరుగొలను కమల స్వతంత్ర్య అభ్యర్థిగా రెండో సెట్టు నామినేషన్ సమర్పించారు. అలాగే ఊబా శ్రీకాంత్, బొంతా కిషోర్, కొక్కిరిపాటి చినబాబు అనే వారు కూడా నామినేషన్లు దాఖలు చేశారు. రిటర్నింగ్ అధికారి అశుతోష్ శ్రీవాస్తవకు వారు తమ నామినేషన్ పత్రాలను అందజేశారు.

బీఎస్పీ తరఫున రెండు ..

నిడదవోలు: బహుజన సమాజ్ పార్టీ (బీఎస్పీ) నిడదవోలు అసెంబ్లీ అభ్యర్థిగా గుమ్మాపు చిత్రసేన మంగళవారం నామినేషన్ దాఖలు చేశారు. అదే పార్టీ తరఫున బయ్యే మునేశ్వరరావు కూడా నామినేషన్ వేశారు.

గోపాలపురంలో నాలుగు..

గోపాలపురం: స్థానిక అసెంబ్లీ స్థానానికి మంగళవారం నాలుగు నామినేషన్లు దాఖలైనట్టు గోపాలపురం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కేఎల్ శివజ్యోతి తెలిపారు. స్వతంత్ర అభ్యర్థిగా దొడ్డిగర్ల నాగార్జున, బీఎస్పీ తరఫున సిర్రా భరత్ నామినేషన్లు వేశారని చెప్పారు. అలాగే టీడీపీ అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు రెండో సెట్ నామినేషన్ దాఖలు చేశారన్నారు. కాగా అదే పార్టీ తరఫున పెనుమాక వినోదకుమారి కూడా నామినేషన్ దాఖలు చేసినట్టు ఆర్వో శివజ్యోతి చెప్పారు.

ఐదేళ్ల అభివృద్ధిని చూసి ఓటేయండి



ఉండ్రాజవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్‌నాయుడు

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీనివాస్ నాయుడు
- ఉండ్రాజవరంలో విస్తృతంగా ప్రచారం

ఉండ్రాజవరం: గత ఐదేళ్లలో రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధిని చూసి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని వైఎస్సార్ సీపీ నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్ నాయుడు విజ్ఞప్తి చేశారు. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావుతో కలసి ఆయన మంగళవారం ఉండ్రాజవరంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. మహిళలు విజయోస్తు అంటూ శ్రీనివాస్ నాయుడి నుదుటన తిలకం దిద్ది హారతిస్తూ ఘనంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన తన ప్రసంగంలో సీఎం జగన్ గత ఐదేళ్లలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 100 శాతం అమలు చేసి మాట నిలబెట్టుకున్నారన్నారు. గత చంద్రబాబు ప్రభుత్వ మోసాలను ప్రజలకు గుర్తు చేశారు. మే 13న జరిగే ఎన్నికల్లో రెండు ఓట్లనూ ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారంలో సర్పంచ్ మెండే వెంకట్రావు, వైస్ ఎంపీపీ నరహరశెట్టి సరోజ, సొసైటీ అధ్యక్షుడు సంకురాత్రి సుబ్బారావు, ఎంపీటీసీ సభ్యుడు గాడి కృష్ణఫర్, కరెళ్ల శ్రీనివాసరావు, బీఎస్సార్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.



ప్రచార రథంపై నుంచి అభివాదం

నిడదవోలు పట్టణంలో..

నిడదవోలు: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జి. శ్రీనివాస్‌నాయుడు, రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ల విజయానికి ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లనూ వేయాలని ప్రజలను కోరుతూ పట్టణంలోని 14వ వార్డులో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్ళి పట్టణంలో చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. పార్టీ వార్డ్ ఇన్‌చార్జి బిర్రే రామకృష్ణ, ఎస్‌కే లాలు, విస్సా గణేష్, కర్రి సాయి, వెంకటేష్, బండి అప్పారావు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుపై ఓటేస్తే మళ్లీ సంక్షేమ పాలన



పల్లంట్ల గ్రామంలో ఫ్యాన్ గుర్తు చూపుతూ ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత



పల్లంట్లలో 'వనితమ్మే కావాలి..వనితమ్మే రావాలి' పాట ఆడియోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత

- వైఎస్సార్ సీపీ అభ్యర్థి తానేటి వనిత
- పల్లంట్ల, లక్ష్మీపురం గ్రామాల్లో ప్రచారం

దేవరపల్లి: మే 13న జరిగే పోలింగ్‌లో రెండు ఓట్లనూ ఫ్యాన్ గుర్తుపై వేసి రాష్ట్రంలో మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు బాటలు వేయాలని వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ఓటర్లను కోరారు. మండలంలోని పల్లంట్ల, లక్ష్మీపురం గ్రామాల్లో మంగళవారం రాత్రి ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. ముఖ్య కూడలి ప్రాంతాల్లో ఆమె ఎన్నికల ప్రచార రథంపై నుంచి మాట్లాడారు. జగనన్నకు ఓటేసి గత ఐదేళ్లలో పొందిన సంక్షేమ పాలనను మళ్లీ తిరిగి తెచ్చుకుందామని ఆమె పిలుపునిచ్చారు.మీ కుటుంబాల్లో మంచి జరిగిందనుకుంటేనే ఓటు వేయమని ధైర్యంగా చెబుతున్న నేత సీఎం జగన్ అని మంత్రి వనిత అన్నారు. జగనన్న మరలా ముఖ్యమంత్రి అయిన వెంటనే స్థానికంగా ఉన్న సమస్యలు తీరుస్తామని ఆమె హామీ ఇచ్చారు. తాను గోపాలపురం ఆడపడుచునని ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనను ఆశీర్వదించాలని కోరారు. గ్రామాల్లో అడుగడుగునా ప్రజలు వనితకు హారతులు ఇచ్చి పూలజల్లు కురిపించారు. తొలుత గ్రామాల్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు మంత్రి వనిత పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వనితమ్మే కావాలి.. వనితమ్మే రావాలి.. పాట ఆడియోను మంత్రి తానేటి వనిత ఆవిష్కరించారు. పాటను కేవీవీ సతీష్, రాకేష్ (నాని), ఆచంట శ్రీను, సమర్పించారు. సాహితీ చాగంటి ఆలపించిన ఈ గేయ రచయిత భారతీబాబు. సంగీతాన్ని ఎస్‌ఏ ఖుద్దూస్ సమకూర్చారు. ప్రచారంలో ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దనరావు, సర్పంచ్ నూతలపాటి వెంకటరమణ, ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పొట్టి స్వర్ణలత, లక్ష్మీపురం సర్పంచ్ దోనెల్లి ధనలక్ష్మి, దోనెల్లి జానకీరామ్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి ఆచంట అనసూయ, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు మేడిబోయిన గంగరాజు, పార్టీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ కుసులూరి వెంకట సతీష్, నియోజకవర్గం అధికార ప్రతినిధి గడా జగదీష్, గోపాలపురం ఎంపీపీ ఉండవల్లి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు కాకులపాటి లలిత తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉంటా.. ఆశీర్వదించండి

- వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు
- కొవ్వూరు మూడో వార్డులో ఇంటింటా ప్రచారం



కొవ్వూరు మూడో వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి తలారి వెంకట్రావు

కొవ్వూరు: నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటానని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను ఆశీర్వదించాలని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని మూడో వార్డులో మంగళవారం సాయంత్రం ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలను వెంట బెట్టుకుని వెంకట్రావు గడప గడపకూ వెళ్లారు. ఇచ్చిన హామీలన్నింటినీ గత ఐదేళ్లలో తూచా తప్పకుండా అమలు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తే ప్రతి పేద కుటుంబానికి మేలు చేకూరుతుందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రచారంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ బండి పట్టాభిరామారావు, నాయకులు వరిగేటి సుధాకర్, కంఠమణి రమేష్‌బాబు, పార్టీ పట్టణ గౌరవాధ్యక్షుడు నగళ్లపాటి శ్రీనివాస్, బావన రాజేష్, తోట రామకృష్ణ, యాళ్ల నరసింహారావు, గంగాధర నాగేశ్వరరావు, పిక్కి శ్రీనివాస్, యజ్జల శ్రీనివాస్, పతివాడ రామారావు, చొప్పా అప్పల నాయుడు, నామా ప్రకాశం, చిట్టూరి అన్నవరం, కొఠతం శేషగిరి, ముంగమూరి నాగమణి, కొడవటి దేవా తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకుడు

పట్టణానికి చెందిన టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు, మాల మహానాడు పట్టణ శాఖ అధ్యక్షుడు మాసా జాన్ మంగళవారం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేశారు. వెంకట్రావు ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. జాన్ పట్టణంలో స్నేహ ఆటో యూనియన్ అధ్యక్షుడిగా పని చేస్తున్నాడు.



టీడీపీ నాయకుడు మాసా జాన్‌ను వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న తలారి వెంకట్రావు

వనితకు మద్దతుగా పల్లెల్లో ప్రచారం జోరు



చిన్నాయగూడెంలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



దేవరపల్లిలో ప్రచారం చేస్తున్న ఎంపీపీ కేవీకే దుర్గారావు, వైఎస్సార్ సీపీ నాయకులు

దేవరపల్లి: వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర హోం మంత్రి తానేటి వనితకు మద్దతుగా నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఆ పార్టీ నాయకులు విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. పోలింగ్ తేదీ దగ్గర పడుతుండడంతో పల్లెల్లో ఎన్నికల ప్రచారం జోరందుకుంది. అభ్యర్థి తానేటి వనిత నామినేషన్ కార్యక్రమం విజయవంతం కావడం పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. రోజూ సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఇంటింటికీ వెళ్లి గత ఐదేళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందించిన సంక్షేమ ఫలాలు, ప్రజారంజక పాలన గురించి వివరిస్తున్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తానేటి వనిత, రాజమహేంద్రవరం ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిని చేయాలని ఓటర్లను కోరుతున్నారు. దేవరపల్లి మండలం దుద్దుకూరులో పార్టీ నాయకులు నిమ్మగడ్డ కృష్ణ, పాపోలు రెడ్డిబాబు ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. చిన్నాయగూడెంలో పార్టీ నియోజకవర్గం అధికార ప్రతినిధి గడా జగదీష్, బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు మేడిబోయిన గంగరాజు, ఎంపీటీసీ సభ్యురాలు మరపట్ల నాగమణి, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తాడిమళ్ల మహేంద్ర తదితరులు ప్రచారం నిర్వహిస్తున్నారు. దేవరపల్లిలో ఎంపీపీ కేవీకే దుర్గారావు ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఇంటింటా జోరుగా తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు.

'అక్షయపాత్ర'కు వైఎస్సార్ సీపీ జిల్లా పదవి

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ జిల్లా సంయుక్త కార్యదర్శిగా నియమితులైన పట్టణానికి చెందిన అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్రను మంగళవారం నియోజకవర్గంలోని పలువురు ఆ పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఆయన పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రస్తుతం శ్రీనివాస రవీంద్ర శ్రీరామ సొసైటీ అధ్యక్షుడిగానూ, 15వ వార్డు కౌన్సిలర్‌గానూ పని చేస్తున్నారు. తనకి ఈ పదవి రావడానికి సహకరించిన ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు రుత్తల భాస్కరరావు, 8వ వార్డు ఇన్‌చార్జ్ గంధ్రోతు శివరామకృష్ణ, కో–ఆప్షన్ సభ్యుడు ఎండీ ఆలీ, కౌన్సిలర్ అంకోలు వెంకట లిల్లీ పద్మలీల, నాయకులు తోట రామకృష్ణ, నామా ప్రకాశం, పాకా మోహనరావు, మెరిపో వీర్రాజు, చీలి ప్రసాద్, తడికొప్పుల శ్రీనివాస్, పార్టీ చాగల్లు మండల శాఖ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గామల్లేశ్వరరావు, సుంకర త్రిమూర్తులు తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



కొవ్వూరులో అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్రను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ తదితరులు

వైఎస్సార్ సీపీకి మద్దతుగా 'భూపతి' ప్రచారం



నిడదవోలు 4వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ, పార్టీ శ్రేణులు

నిడదవోలు: వైఎస్సార్ సీపీ పాలనలో ఇంటి వద్దకే సంక్షేమ ఫలాలు అందుతున్నాయని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జి.శ్రీనివాస్‌నాయుడికి మద్దతుగా పట్టణంలోని 4వ వార్డులో మంగళవారం ఆదినారాయణ పార్టీ శ్రేణులతో కలసి ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి, గత ఐదేళ్లలో పట్టణ ప్రజలకు అందిన వివిధ సంక్షేమ పథకాలు, పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి నియోజకవర్గ అభివృద్ధికి అన్నివిధాలా కృషి చేసిన ఉన్నత విద్యావంతుడైన జి.శ్రీనివాస్‌నాయుడికి అఖండ విజయాన్ని చేకూర్చాలని అభ్యర్థించారు. ప్రచారంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు గంగుల వెంకటలక్ష్మి, యలగాడ బాలరాజు, కౌన్సిలర్లు షేక్ వజీరుద్దీన్, గుర్రం శాంతిశ్రీ , పువ్వుల రతీదేవి, ఆకుల ముకుందరావు, అహ్మదున్నీసాబేగం, మానుపాటి లక్ష్మి, అరుగొళ్లు వేంకటేశ్వర్లు, పార్టీ నాయకులు గంగుల గోపీయాదవ్, షేక్ ఖాన్ బాషా, అడపా రాజు, మేడపాటి రామకృష్ణారెడ్డి, మానుపాటి తేజ, తోలేటి కోటి, గుర్రం జేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ టాపర్లకు చాగల్లులో సత్కారం



టెన్త్ పరీక్షల్లో టాపర్లను సత్కరించిన అధికారులు

చాగల్లు: ప్రభుత్వ పాఠశాలల్లో చదివి పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను మంగళవారం ఎంపీడీవో నాతి బుజ్జి, తహసీల్దార్ కె.సావిత్రి, ఎంఈవో సుభాకర్ సత్కరించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. టెన్త్ పరీక్షల్లో మండల టాపర్‌గా నిలిచిన ఊనగట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని నందిగం నిధి ప్రియ (575/600), ద్వితీయ స్థానంలో నిలిచిన చాగల్లు జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని బొల్లా స్నేహ (574/600), తృతీయ స్థానంలో నిలిచిన మార్కొండపాడు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థిని ఈ.లక్ష్మీప్రియ (568/600)లకు అధికారులు దుశ్శాలువాలు కప్పి అభినందించారు. విద్యార్థులను ప్రోత్సహించడానికి ఎంపీడీవో నాతి బుజ్జి నగదు పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో ఊనగట్ల, చాగల్లు, మార్కొండపాడు జెడ్పీ హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ,విద్యార్థినుల తల్లిదండ్రులు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది శ్రీ ప్రేమాచారి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణగూడెంలో ఉపాధి పనుల పరిశీలన

చాగల్లు: బ్రాహ్మణగూడెంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ, ఉపాధి హామీ పనుల ప్రోగ్రాం అధికారి నాతి బుజ్జి మంగళవారం పరిశీలించారు. మస్టర్ల ప్రకారం వేతనదారుల వివరాలను, పని ప్రదేశాన్ని ఆమె పరిశీలించారు. కొలతల ప్రకారం పనులు పూర్తి చేయించి కూలీలు గరిష్ట వేతనం పొందేలా చూడాలని సిబ్బందిని ఆమె ఆదేశించారు. ఉపాధి పనుల అంచనాలపై ఎప్పటికపుడు మేట్లకు అవగాహన కల్పించాలని సాంకేతిక సిబ్బందికి సూచించారు. మంగళవారం జరిగిన పంట బోదుల పూడికతీత పనులకు 123 మంది వేతనదారులు హాజరయ్యారని ఎంపీడీఓ తెలిపారు.

చికిత్స పొందుతూ వైఎస్సార్ సీపీ కార్యకర్త మృతి

మృతదేహానికి హోం మంత్రి నివాళులు



పల్లపు అబ్బులు (ఫైల్)

దేవరపల్లి: మండలంలోని కృష్ణంపాలెం వద్ద కొద్ది రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వైఎస్సార్ సీపీ కార్యకర్త పల్లపు అబ్బులు (75) చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మండలంలోని కురుకూరు గ్రామానికి చెందిన అబ్బులు (పల్లయ్య) ఈ నెల 19న వైఎస్సార్ సీపీ గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి తానేటి వనిత నామినేషన్ కార్యక్రమానికి ఆ పార్టీ శ్రేణులతో కలసి గోపాలపురం బయలు దేరాడు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో నాయకుల సూచన మేరకు అబ్బులు యర్నగూడెం నుంచే బైక్‌పై స్వగ్రామానికి తిరుగు ప్రయాణమయ్యాడు. యర్నగూడెం–కృష్ణంపాలెం గ్రామాల మధ్య గుర్తుతెలియని వాహనం అతడి బైక్‌ను ఢీ కొట్టింది. తీవ్ర గాయాలైన ఆ వృద్ధుడిని రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఐదు రోజులుగా చికిత్స పొందుతున్న అబ్బులు సోమవారం మృతి చెందాడు. స్వగ్రామం కురుకూరు తీసుకు వచ్చిన అబ్బులు మృతదేహాన్ని రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత మంగళవారం సందర్శించి, పూలమాల వేసి నివాళులు అర్పించారు.



అబ్బులు మృతదేహానికి మంత్రి వనిత నివాళులు

క్వారీ గోతిలో స్నానం చేస్తూ బాలుడి మృతి

దేవరపల్లి: క్వారీగోతిలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తూ నీటమునిగి 13 ఏళ్ల బాలుడు మృతి చెందిన ఘటన మంగళవారం గౌరీపట్నం శివారు కొండగూడెంలో జరిగింది. ఈ ప్రాంతంలోని కోడూరి వారి క్వారీ కొంతకాలంగా పనిచేయడం లేదు. క్వారీ గోతిలో వర్షపునీరు, ఊటనీరు చేరాయి. కొండగూడేనికి చెందిన బాలుడు కుంచల వెంకటేష్(13) మంగళవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఎండ తీవ్రతను తట్టుకోలేక క్వారీ గోతిలో స్నానానికి దిగాడు. క్వారీ గొయ్యి లోతు ఎక్కువగా ఉండడంతో ప్రమాదవశాత్తూ నీట మునిగి అతడు మృతి చెందినట్టు దేవరపల్లి ఎస్సై కె. శ్రీహరిరావు తెలిపారు.

